# శేషకవిత

కాలేజీ సెలవుల్లో స్నేహితుల్తో కలిసి సర్దాగా ఉత్తర భారతదేశం తిరగడానికి వెళ్ళిన మోహనకృష్ణ పక్షం రోజుల తర్వాత ఇంటికి తిరిగొచ్చాడు. గుమ్మంలో అడుగు పెడుతూనే అతనికి తల్లి గదిలోంచి ఎవరిదో శ్రావ్యమైన కంఠస్వరం మధురంగా గానం చేస్తుండడం వినిపించింది.

"లలిత లవంగ లతా పరిశీలన
కోమల మలయ సమీరే..."

— జయదేవుడి అష్టపది.

ఆ కంఠస్వరంలో ధ్వనిస్తున్న మాధుర్యానికి ముగ్ధుడై అతను కొద్ది క్షణాలు ఎలా వున్న వాడలాగే నిలబడిపోయాడు. ఆ తర్వాత తనకు తెలియకుండానే తల్లి గదివైపు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ గదిలో పందిరి మంచం కోడుకానుకుని కింద చాపమీద కూచుంది పద్మావతమ్మ. ఆవిడ ఎదురుగా కూర్చున్న ఓ యువతి తన్మయత్వంతో పాడుతోందా అష్టపది.

ఆ అమ్మాయికి సుమారు పద్దెనిమిదేళ్ళ వయస్సుండవచ్చు. సన్నగా అరిపేదగా కనిపిస్తోంది. చెప్పుకోదగ్గంత రంగేం కాదు. అయితే కనుముక్కు తీరు మాత్రం చూడ చక్కగా వుంది. వంటి మీద సాదా సీదాగా వున్న ఓణీ పరికిణీ ధరించింది. ఆ గాత్ర మాధుర్యమే ఆమెకు లేని అందం ఆపాదిస్తున్నట్టుగా తోచింది మోహనకృష్ణకి. ఆ అష్టపది ఆమె గానం చేస్తుంటే ఆమె వదనంలోంచి వెలువడుతున్న తేజస్సుతో ఆ గది నిండిపోతున్న అనుభూతి కలిగింది.

"అరె, మోహనకృష్ణ! నువ్వెపుడొచ్చావ్?" కొడుకుని చూస్తూనే సంభ్రమంగా లేచి నిలబడుతూ అంది పద్మావతమ్మ. ఆవిడతో పాటు ఆ అమ్మాయి కూడా లేచి నిలబడింది. "వస్తానండీ" అంటూ నమ్రతగా పద్మావతమ్మతో చెప్పి తల వంచుకుని ఆ గదిలోంచి బయటికి వెళ్ళిపోయింది.

"ఏవిటలా నిలబడిపోయావ్? పదపద— ఊళ్ళు తిరిగొచ్చావ్, కాళ్ళు కదుక్కుందువుగాని" తల్లి హెచ్చరికతో గానీ అతను మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి పడలేకపోయాడు మోహనకృష్ణ.

"ఆ అమ్మాయి ఎవరమ్మా? నేనెప్పుడూ చూడనేలేదు" అన్నాడు ఆ రాత్రి భోజనానికి కూర్చుంటూ.

"ఆ అమ్మాయా? పేరు కళ్యాణి. వాళ్ళమ్మ సావిత్రిది ఇదే వూరు. నువ్వు మరీ పసివాడిగా వున్నప్పుడు నా ఆరోగ్యం ఓసారి బాగా చెడిపోయింది. అప్పుడు ఆ కళ్యాణీ వాళ్ళమ్మే వచ్చి ఇంటిపని చేసి పెడుతుండేది. తర్వాత పెళ్ళై గుంటూరు వెళ్ళిపోయింది. పాపం సావిత్రి భర్త ఇటీవలే పోయాట్ట!"

"అయ్యో, అలాగా పాపం! ఆయనేం చేస్తుండేవాడు?"

## లవ్లీ స్టోరీస్

"ఏదో చిన్న వుద్యోగం. ఆయన పోయాక వీళ్ళకి జీవనాధారం పోయింది. కూతుర్ని తీసుకుని మళ్ళీ ఈ వూరొచ్చేసింది సావిత్రి. ఆమెని నువ్వు చూడనే లేదు కదూ! చాలా మంచి మనిషి. వాళ్ళకి రావలసిన పింఛమూ వగైరా గొడవలన్నీ, మీ నాన్నగారే చూస్తామన్నారు. ఈ లోగా ఏదో మనింట్లో పని చేస్తానంటే అంతకంటేనా సరేనన్నాను. ఆ అమ్మాయి కళ్యాణి వుంది చూశావూ, సంగీత సరస్వతి. గుంటూర్లో పదో తరగతి వరకూ చదువుకుందట. దాంతోపాటే కూతురికి సంగీతమంటే ఇష్టమని అది కూడా నేర్పించాట్ట వాళ్ళ నాన్న. భారతం ఎంత గొప్పగా చదువుతుందనుకున్నావ్! ప్రతి పద్యం రాగయుక్తంగా పాడగలదు. ఆ పద్యాలు వినాలంటే ఆ అమ్మాయి నోటి వెంటే వినాలి. ఈ వయసులో నాకు అంతకంటే ఏం కావాలి? రోజూ సాయంత్రం భారతం చదివి వినిపించడానికొస్తుంది. వెళ్ళేముందు ఓ అష్టపదో ఓ అన్నమాచార్య కీర్తనో పాడివెళ్తుంది."

## దాదా హయాత్

"అయితే ఇంకేం! నీకు మంచి తోడే దొరికింది" నవ్వుతూ అన్నాడు మోహనకృష్ణ. పైకి అలా నవ్వుతూనే కనిపించాడు గానీ అతని మనసు మాత్రం కళ్యాణి కథ విన్నాక ఆర్ద్రమైంది.

ఆ మర్నాడు సాయంత్రం కళ్యాణి ఎప్పట్లా మామూలుగానే వచ్చింది. ఆ సమయంలో మోహనకృష్ణ ఇంట్లోనే వున్నాడు.

తల్లికామె భారతం చదివి వినిపిస్తుంటే అతను తన గదిలో కూచుని శ్రద్ధగా వినసాగాడు. అలా వింటూనే క్రమంగా మైమర్చిపోయాడు. కళ్యాణి భారతం చదువుతున్నంతసేపూ సమయం ఎలా గడిచిపోయిందో అతనికే తెలియలేదు.

అక్కడ తన గదిలో పద్మావతమ్మ భారతం వింటూ వింటూ పందిరి మంచానికానుకుని ఎలా వున్నదలాగే నిద్రలోకి జారుకుంది. కళ్యాణి రెండు మూడు సార్లు పిలిచినా పలకలేదు. దాంతో ఏం చేయాలో తోచక కాసేపు దిక్కులు చూస్తూ కూర్చుండిపోయిందల్లా కళ్యాణి మరింక లాభం లేదన్నట్టు పుస్తకం మూసి గూట్లో పెట్టేసి నెమ్మదిగా ఆ గదిలోంచి బయటికొచ్చింది. అలా గుమ్మందాకా వెళ్ళిందో లేదో వెనకనుంచి, "ఏవండీ" అనే పిలుపు వినిపించడంతో చట్టునాగిపోయింది.

మోహనకృష్ణ ఆమె ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"క్షమించండి. వెళ్తున్నవారిని సభ్యత లేకుండా ఆపినందుకు దయచేసి మరోలా అనుకోవద్దు. మీరు నిజంగా చాలా బాగా పాడతారు."

అతనా మాటనగానే అతనివంక చురుగ్గా చూస్తున్న ఆమె చూపులు క్రమంగా కిందికి వాలిపోయాయి.

ఆమె మళ్ళీ ఏమనుకుంటుందో ఏమో అన్నట్టు అతను గబగబా అన్నాడు—

"నిజం చెప్పాలంటే నిన్న ఇంట్లోకి నేను అడుగు పెడుతుండగానే మీ గానమాధుర్యం నన్నలాగే కట్టిపడేసింది. రైల్లో కొన్ని వందలమైళ్ళు ప్రయాణం చేసి వచ్చిన బడలికంతా మీ పాట వింటూనే తీసేసినట్టుగా పోయింది."

ఆమె ఆ మాటకు సమాధానం చెప్పలేదు. అలా తలవంచుకునే కాలి బొటనవేలితో నేల మీద రాస్తుండిపోయింది.

"మహాభారతమంటే నాకు మొదట్నుంచీ చాలా ఇష్టం!" అతను మళ్ళీ చెప్పనారంభించాడు. "కవిత్రయం వారి భారతాన్ని నేను పూర్తిగా చదివాను. అయితే ఇందాక మీరు భారతం చదువుతుండగా విన్న అనుభూతే వేరు. పంచదార గుళికల్లాంటి నన్నయగారి పద్యాలని సంగీతంలో ముంచి తేల్చి మీరు అమృతగుళికలుగా మార్చారు. మీ గాత్ర మాధుర్యం గురించి ఇంతకంటే చెప్పడానికి నాకు మాటలు చాలడం లేదు' అన్నాడు.

ఆమె అప్పటికీ సమాధానం చెప్పలేదు. అలా తలవంచుకునే వుండిపోయింది.

## రచయిత గురించి—

'లవ్ లీ స్టోరీస్' అందిస్తున్న రచయిత దాదా హయాత్ 'మయూరి' పాఠకులకు పరిచితులే. 1983 నుంచి రచనలు చేస్తున్న ఈ రచయిత విమర్శకుల ప్రశంసలు పొందిన కథలనేకం రాశారు. వీరి రచనలు అనేక కథా సంకలనాలలో చోటు చేసుకున్నాయి. ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయి. ఇటీవల 'మయూరి' నిర్వహించిన దసరా కథల పోటీకి వీరు న్యాయ నిర్ణేతలలో ఒకరుగా వ్యవహరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిలో వున్నారు.

"మీరు మరేమీ అనుకోకపోతే నాదో చిన్నకోరిక" అన్నాడతను.

ఆమె చప్పున కళ్ళు పైకెత్తి చూసింది.

"నాక్కూడా కాస్తోకూస్తో కవిత్వంలో ప్రవేశం వుంది" అంటూ అతను జేబులోంచి ఓ కాగితం బయటికి తీశాడు. "ఇది నేను రాసిన గీతం. దీన్ని మీరు భావకవిత్వమే అంటారో, ప్రేమ కవిత్వమే అంటారో, లేక మరింకేమైనా అంటారో మీ ఇష్టం. ఇది మాత్రం నేను రాసిన వాటిలో నాకు చాలా ఇష్టమైన గీతం. చూడండి."

కళ్యాణి ఆసక్తిగా ఆ కాగితాన్నందుకుంది.

"నీవు పూవువైన నాదు
నీకు తావినైన చాలు,
నీవు జీవితానివి
నీవు నాకు వున్న చాలు"

—కాగితం చూడనక్కర్లేకుండానే చదివాడు మోహనకృష్ణ.

"ఓహ్! చాలా బావుంది" అప్రయత్నంగా అంది కళ్యాణి.

అతని కళ్ళు మెరిశాయి. "మీరీ గీతం నాకు పాడి వినిపించగలరా? అదే నా కోరిక."

ఆమె అతనివంక కొద్ది క్షణాలు రెప్పలార్పకుండా చూసి తిరిగి కళ్ళు ఆ కాగితం వైపు తిప్పింది.

"కానీ, అది అసంపూర్తిగా వున్నట్టుంది" నెమ్మదిగా అంది.

"నిజమే. ఆ గీతం నేను పూర్తి చేయలేకపోయాను. అదలా శేష కవితగానే మిగిలిపోయింది. చెప్పండి కళ్యాణిగారూ! నాకీ పాట పాడి వినిపించగలరా?"


"ప్రయత్నిస్తాను" అని ఆమె ఒక్క క్షణం ఆగి, మీకభ్యంతరం లేకపోతే ఈ గీతం రెండో భాగం నేను పూర్తి చేయనా?" అడిగింది.

ఆ మాటకు అతను అప్రతిభుడై, "అంతకంటే అదృష్టమా!" అన్నాడు.

కళ్యాణి మరోమాట మాట్లాడకుండా ఆ కాగితంతో పాటు అక్కడ్నించి వెళ్ళిపోయింది. మోహనకృష్ణ ఆమె వెళ్తున్న వైపే తదేకంగా చూస్తుండిపోయాడు.

ఆ మర్నాడు సాయంత్రం కళ్యాణి ఇంట్లోకి వస్తున్న అలికిడి వినిపించగానే మోహనకృష్ణ తన గదిలో వున్నవాడు కాస్త ఒక్కసారిగా లేచి ఆమె ముందుకు పరిగెత్తాడు. అతన్ని అల్లంత దూరంలో చూస్తూనే కళ్యాణి గుమ్మందాటి లోనికొస్తున్నది కాస్త ఎక్కడున్నదక్కడే ఘనీభవించిన నీటి కెరటంలా ఆగిపోయింది.

మోహనకృష్ణ పెదవి కదిపి ఒక్క మాటకూడా అడగలేదు. అతని కళ్ళు మాత్రం 'నా కవిత?'



అన్నట్టు చూశాయి.

కళ్యాణి పెదవుల మీద అప్రయత్నంగా సన్నని చిరునవ్వు మెదిలింది. అతని కళ్ళు వేసిన ప్రశ్నకు దీటుగా, "ఓపిక పట్టండి" అన్నట్టు కళ్ళతోనే సమాధానం చెప్పి అతన్ని తప్పించుకుంటూ లేడిపిల్లలా పద్మావతమ్మగారి గదిలోకి తుర్రుమంది.

పందిరి మంచం మీద కూర్చున్నదల్లా పద్మావతమ్మ మొహం కళ్యాణిని చూస్తూనే వికసించింది. 'వచ్చావా? అదేమిటో నిన్న నువ్వు భారతం చదువుతుండగానే ఎక్కడినుంచి వచ్చిందో పాడు నిద్ర వళ్ళెరక్కుండా పట్టేసిందనుకో. మళ్ళీ భోజనాల వేళక్కానీ మెలకువ రాలేదు. జరిగిపోయిన అపరాధానికి అప్పుడే గట్టిగా లెంపలు వాయించేసుకున్నాననుకో. ఇంతకీ నిన్న మనం ఎక్కడున్నాం? గరుత్మంతుడు తల్లి దాస్యం విడిపించడానికి అమృతం కోసం బయల్దేరుతున్నాడు కదూ! ఆ తర్వాత ఏమైందో చదువు."

ఆవిడ ఆ మాటలన్నీ అంటుండగానే కళ్యాణి మూలనున్న చాప తెచ్చి నేల మీద పరిచేసింది. పద్మావతమ్మ ఎప్పట్లాగే పందిరి మంచం కోడుకానుకుని చాపమీద చతికిలబడింది. క్రితం రోజు ఆగిపోయిన ఘట్టం దగ్గర్నుంచి భారత పఠనం మళ్ళీ ప్రారంభమైపోయింది.

మోహనకృష్ణ తన గదిలో కూచుని పద్యం వెంట పద్యం వీనుల విందుగా ఆలకిస్తున్నాడు.

సుమారు గంటన్నర తర్వాత కళ్యాణి ఆ రోజుకు భారతం చదవడం ముగించి పద్మావతమ్మ గారికెంతో ఇష్టమైన "అదివో అల్లదివో శ్రీహరి వాసము" అనే అన్నమాచార్య కీర్తన ఎత్తుకుంది. ఆమె పాడుతున్నంత సేపూ తన్మయత్వంతో మైమర్చి వింటుండిపోయిన పద్మావతమ్మ కీర్తన పూర్తవుతూనే సంబరంగా కళ్యాణి చుట్టూ చేతులు తిప్పి మెటికలు విరుచుకుంటూ,

"నా తల్లే! ఎంత బాగా పాడావమ్మా కీర్తన!" అంది.

"ఈ రోజు నేను మరో పాట పడదామనుకుంటు న్నానండీ" తలవంచుకుని ఎంతో వినయంగా అంది కళ్యాణి.

"అయ్యో నా తల్లీ! అంతకన్నానా? పాడమ్మా పాడు" అంది పద్మావతమ్మ.

తన గదిలో కూర్చున్న మోహనకృష్ణ ఆ మాట వినగానే కుర్చీలో నిటాగ్గా బిగుసుకుపోయాడు. అతని గుండె లయతప్పి స్పందించనారంభించింది.

కళ్యాణి పాడనారంభించింది—

"నీవు పూవువైన నాడు
నీకు తావినైన చాలు;
నీవు జీవితానివి
నీవు నాకు వున్న చాలు
ఒకరి మనసు ఒకరికి
భావనిలయమైనచో
ఒకరి కనుల నొకరికి
వ్రాయలేని ప్రణయ కవిత;
నేను కవితనైన నాడు
నీవు భావమైన చాలు,
నీవు జీవితానివి
నీవు నాకు వున్న చాలు"

ఆమె పాట ముగించే సమయానికి పూర్తిగా పరవశత్వంలో పడిపోయిన మోహనకృష్ణ చివరగా అదే మూడ్‌లో కుర్చీలోంచి అలాగే జారి కిందపడబోతూ నిలదొక్కుకున్నాడు.

"పాతకాలంనాటి సినిమా పాటలా వినసొంపుగా చాలా బావుందమ్మాయ్. ఎక్కడ నేర్చుకున్నావీ పాట?" అడిగింది పద్మావతమ్మ.

"ఓ పెద్ద కవిగారు రాశారెండి," అంటూ సరిపుచ్చేసింది కళ్యాణి.

ఆమె ఇంట్లోంచి బయటికి వచ్చేస్తుండగా గుమ్మం వెలుపల చాటుగా ఎదురయ్యాడు మోహనకృష్ణ.

"థ్యాంక్స్"

కళ్యాణి సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో ముందుకు వెళ్ళబోయింది.

"ఏవండీ, ఆ పాట నేను రాసినంతవరకే పాడారు. మిగతా సగం మీరు పూర్తి చేస్తానన్నారుగా?" వెనకనుంచి అన్నాడతను.

ఆమె ఆగి, "దేనికైనా సమయం రావాలి" అనేస్తూ గబగబా వెళ్ళిపోయింది.

ఆ రోజునుంచి మోహనకృష్ణ ఠంచనుగా ఆమె వచ్చేవేళకు గుమ్మందగ్గరే నిలబడతాడు. ఆమె కళ్ళబడుతూనే, "ఏవండీ, నా శేషకవిత?" అంటాడు. ఆమె నవ్వుతూనే లోపలికి వెళ్ళిపోతుంది. భారత పఠనం పూర్తి చేశాక ఆమె తిరిగి వెళ్ళేటప్పుడు అతను మరోసారి గుమ్మం దగ్గర ఎదురవుతాడు. "రేపైనా నా శేషకవిత పూర్తి చేసి వినిపిస్తారా?" అనడుగుతాడు. దానికెప్పుడూ ఆమె చిరునవ్వే సమాధానమవుతుంది.

రోజూ అదే తంతు. అలాగే కొన్ని నెలలు గడిచిపోయాయి. కళ్యాణి చదువుతున్న భారతం పూర్తి కావస్తోంది. ఇవాళో రేపో స్వర్గారోహణ పర్వంలోకి కథ అడుగు పెట్టబోతోంది.

ఒకరోజు కళ్యాణి రాలేదు.

మోహనకృష్ణ ఆ సాయంకాలమంతా తన గదిలోంచి గుమ్మం దగ్గరికీ, గుమ్మం దగ్గర్నుంచి తన గదిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. ఎంతకీ కళ్యాణి వస్తున్న జాడ కనిపించలేదు. చివరికి మనసుండబట్టలేక తల్లి గదిలోకి వెళ్ళాడు.

"అమ్మా, ఈ రోజు నీ సంగీత సరస్వతి రాలేదేం?" అనడిగాడు.

పద్మావతమ్మ ఆ రోజు తనే భారతం చదువుకుంటోంది. "కళ్యాణికి పెళ్ళి చూపుల్రా! వాళ్ళ వాళ్ళెవరోనట. అందుకే ఈ రోజు రాలేదు" పుస్తకంలోంచి తలెత్తకుండానే చెప్పింది.

ఆ మాట వింటూనే మోహనకృష్ణకు మతిపోయినట్టయ్యింది. "పెళ్ళి చూపులా!" అంటూ ఇంకేమనలేక అక్కడ్నుంచి బయటికొచ్చేశాడు.

ఆ రాత్రంతా అతనికి నిద్ర పట్టలేదు. గుండెలో ఏదో ఖాళీ ఏర్పడినట్లై ఒక విధమైన బాధతో పక్కమీద పొర్లుతూ వుండిపోయాడు.

ఆ మర్నాడు సాయంత్రం కళ్యాణి వచ్చింది. ఆ రోజున ఎప్పట్లా అతను, "ఏవండీ నా శేషకవిత?" అనడగలేకపోయాడు. ఆమె కూడా అతనివైపు చూడకుండా ముభావంగా లోనికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి కూడా అతను నిద్రపోలేకపోయాడు. కళ్ళు తెరిచి పెట్టుకుని పై కప్పు వంకే చూస్తూ తీవ్రంగా ఏదో ఆలోచిస్తుండిపోయాడు. తూర్పు తెలవార వస్తుండగా ఎప్పుడో ఒక నిశ్చయానికి రాగలిగాడు. ఆ తర్వాత మనసు తేలికై తనకు తెలియకుండానే మాగన్నుగా నిద్ర పట్టింది. నిద్ర మేలుకుంటూనే అతను నేరుగా తల్లి దగ్గరికి వెళ్ళాడు.

"అమ్మా, నీతో ఒక విషయం మాట్లాడాలి."

రాత్రంతా నిద్రలేక అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. పద్మావతమ్మ ఆశ్చర్యంగా చూసిందతన్ని. "ఏవిటీ అవతారం? మొహం కూడా ఇంకా కడుక్కున్నట్టు లేదు. ఎందుకింత ఆలస్యంగా నిద్ర లేచావు?" అనడిగింది.

మోహనకృష్ణ ఆ మాట పట్టించుకోలేదు. "నేను కళ్యాణిని, పెళ్ళి చేసుకోదల్చుకున్నాను" అన్నాడు ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా.

పద్మావతమ్మ ఆ మధ్యాహ్నం వంటకోసం ములక్కాడలు తరుగుతున్నదల్లా ఆ మాటకు చేతిలోని ములక్కాడ వదిలేసింది. "ఏవిట్రా నువ్వంటున్నది? మతిగాని పోలేదుగదా!"

"మతి వుండే మాట్లాడుతున్నానమ్మా! కళ్యాణి అంటే నాకు చాలా ఇష్టం. నీక్కూడా తనంటే ఇష్టమే కదా! కళ్యాణి మరొకర్ని పెళ్ళి చేసుకోవడం నేను భరించలేను. దయచేసి నువ్వే ఈ విషయంలో ఏదైనా చెయ్యమ్మా" అనేసి మరింకో మాటనకుండా అక్కడ్నుంచి ఇవతలికొచ్చేశాడు.

పద్మావతమ్మ స్తబ్దురాలై చాలా సేపు గోడకానుకుని కూర్చుండిపోయింది.

— ఈ కథకు ముగింపు వచ్చేవారం.

